# ఎడారి పూలు

శ్రీనివాస్ అల్లాడి



రేపు శుక్రవారం. సెలవురోజు.

మా వూరి మట్టివాసన గుబాళింపు మా గుండెలను ఉక్కిరి బిక్కిరి చేసేరోజు. గంటన్నర కింద మా వూరి మట్టిని, మా తల్లుల ఆప్యాయతను, మా భార్యల కన్నీటి చారికలను, మా పిల్లల అమాయకత్వాన్ని చూసి వచ్చిన సూర్యుడు మాకు ఎన్నెన్నో కబుర్లు చెప్పేరోజు.

గురువారం సాయంత్రమే రూంలో సందడి మొదలైంది. సాయంత్రం డ్యూటీనుండి వచ్చి రిలాక్సవబోతుండగా దిగారు రాజేశం, అతని రూం మేట్స్.

మొబైల్‌లో మందు ఆర్డర్ చేసి కూర్చున్నాము.

మందు గొంతులోకి దిగిందంటే జ్ఞాపకాలు గదంతా పరుచుకుంటాయి. కన్నీళ్ళు కూడబెట్టుకుంటూ బ్రతికేవాళ్ళం. జ్ఞాపకాలే కలలు మాకు.

చీకటి చిక్కనయింది.

సీడి ప్లేయర్‌లో మంద్రంగా వినిపిస్తున్న పాట...

''పగలైనా రేయైనా ఎడారిలో ఒకటే లే'' అని.

మాటల్లో మనసు పరిచాడు రాజేశం.

''అయ్యవ్వలు ముసలోళ్ళైపాయిరి. నేను లేని ఇంట్ల ఉండబుద్ధిగాక ఇంటిది తల్లిగారింటికి పాయె. నడిమిట్ల పిల్లల సదువు నాశనమైతదని గాల్లను కోరుట్లల ఆస్టల్‌ల ఏసిన. నల్గురం నాల్గు దిక్కుల... పిల్లల యాదికత్తె నా పానం సిన్నవోతది''

రాజేశంది సుమారు నావయస్సే. చిన్నవయసులోనే పెళ్ళి కావడం పిల్లలు పుట్టడం జరిగింది. అతనికన్నా అతని భార్యది ఇంకా దుర్భర పరిస్థితి. మాతృత్వం మాధుర్యం తెలీని వయసులో పిల్లల్ని కనడం... తెలుసుకునే లోగానే పిల్లల్ని తల్లికి దూరం చేసి హాస్టల్‌లో వేయడం.

నాకు తెలిసిన భాషలో రాజేశాన్ని ఓదార్చాను.

రాత్రి పన్నెండు దాటింది. పార్టీలో డిస్కషన్స్ కంటిన్యూ అవుతూనే వున్నాయి. దేశం కాని దేశంలో మాకు మేమే అన్నదమ్ములం.. మాకు మేమే అన్నీనూ. భిన్నత్వంలో ఏకత్వం అంటే ఎక్కడైనా కనిపిస్తుందో లేదోగానీ..





ఇక్కడ మాత్రం అది సాక్షాత్కారం అయింది.

* * *

కరవు తరిమేస్తే దుబాయి చేరిన వేణు... ఒక ఫోటో చేత్తో పట్టుకుని తదేకంగా చూస్తూ మూగగా ముచ్చటించడం గమనించాను.

''చూశావా! వేణుకు భార్యంటే ఎంత ప్రేమో'' అని రాజేశంతో అంటూ ఆ ఫోటో లాక్కుని చూశాను.

బుగ్గల్ని తాకితే పసితనం కందిపోతుందన్నంత ముద్దుగా వుంది ఓ పాప. తన తండ్రిని ఆహ్వానిస్తున్నట్లు చేతులు చాచి నిల్చునుంది. ఆ ఫోటో నా చేతిలో వున్నంతసేపు ఆ పాపే నా ఒళ్ళో కూచొని ఆటలాడుతున్నట్టుగా ఫీలింగ్. మరి... మరి... వేణు పరిస్థితి...?

రాజేశం చెబితే తెలిసింది. వేణు పెళ్ళయ్యాక మూణ్ణెల్లకే విమానం ఎక్కాడని. ఆ మూణ్ణెల్ల కాపురపు తీపి గురుతే ఈ పాప అని. రెండేళ్ళ వయసున్న తన కూతురునింతవరకు ప్రత్యక్షంగా చూడని వేణు ఎంత క్షోభననుభవిస్తున్నాడో... అతని కళ్ళల్లో కదలాడుతున్న కన్నీటి పొరనడిగితే తెలుస్తుంది.

* * *

మా అందరిలోకి పెద్దవయసు రాజేశం రూంమేట్ సాయన్నది. మాటల మధ్య అర్థమైందేందంటే గత ఇరవై అయిదు సంవత్సరాలూ గల్ఫ్‌కే అంకితం చేశాడతని జీవితం. రెండు మూడేళ్ళకోసారి సెలవుపై వెళ్ళి రెండు మూడు నెలలు మాత్రమే అతని కుటుంబంతో గడిపేది. అతను పంపే డబ్బుల్లోనే సాయన్నను చూసుకుంటారేమో.. నలుగురు పిల్లలూ, అతని భార్య.

ఎంత యాంత్రికమయ్యాయీ ప్రేమలు? పాపం... సాయన్నకు నా 'తండ్రి' వయసుంటుందేమో.

* * *

'తండ్రి'... 'తల్లి'.. ఈ ఆలోచన మనసు పొరల్లోని చేదు జ్ఞాపకాలను బయల్పడేలా చేసింది. కళ్ళతో ఏర్పడిన నీటి సుడుల మాటున కాలచక్రం గిర్రున ఇరవై సంవత్సరాలు వెనక్కి తిరిగింది.

* * *

బాల్యం... నాకు నేనే తెలియని పసితనం. విధి వినిపించిన మరణ మృదంగ ఘోష భరించలేక నన్ను వదిలివెళ్ళిపోయారు నా తల్లిదండ్రులు ఓ యాక్సిడెంట్ రూపంలో. ముసలిదైన అమ్మమ్మ వద్దకు చేరాను అనాథగా!

ఒక్క పూటకూడా సరిగా తిండి దొరకని పేదరికం.

రామయ్య సార్ ప్రోద్బలం, సహకారంతో మా ఊళ్ళోని ప్రభుత్వ పాఠశాలలో చేరాను. పుస్తకాలను పేర్చి భుజంపై ఆన్చి పట్టుకోవడమే తప్ప స్కూల్ బ్యాగంటే తెలియదు. వెనుక ఇరువైపులా చిరుగులున్న బొందుల నిక్కర్లు రెండు, సగం కాలర్ కొరికివేయబడ్డ షర్టులు రెండు.. నాకున్న డ్రెస్సులు. అవీ రామయ్య సార్ ఇప్పించినవే.


అయినా... ప్రతిరోజూ నన్ను బడికి తీసుకెళ్ళేది నా బాల్యం. బడికెళ్ళే దారిలో కన్పించే ఆవుపాలు తాగుతున్న దూడను చూడగానే పోయిన 'అమ్మ' గుర్తొచ్చేది. ఆ క్షణం నాలో ఓ అందోళన.. ఓ అమూర్త భావన. అదీ... ఆ దూడంటే కలిగే ఈర్ష్యేనేమో?

ఇంటర్వెల్‌లో ఇంటినుండి డబ్బులు తెచ్చుకున్న తోటిపిల్లలు ఐస్‌ఫ్రూట్‌లు తింటుంటే... నేను ఆ డబ్బా కార్నర్‌లోని రంధ్రం నుండి కారే ద్రవాన్ని అరచేత్తో పట్టుకొని తాగేవాన్ని. అప్పుడు నాన్న గుర్తొచ్చే వాడు. తనుంటే నాకూ ఇచ్చేవాడుగా డబ్బులు.

మావూరి పక్కనే వున్న పెద్ద మర్రిచెట్టుకిందకి అప్పుడప్పుడు వెళ్ళేవాళ్ళం మా ఫ్రెండ్సంతా.. ఆడుకోడానికి.

ఆడుకొనేవాళ్ళం. ఆనందించే వాళ్ళం. అక్కడి కోతుల గుంపును ఆటపట్టించడానికి మేమూ కోతులమయ్యేవాళ్ళం. కానీ.. ఓ చిన్నకోతి తన తల్లి కడుపును పట్టుకొని, అతుక్కొని వుండే దృశ్యం కనబడేసరికి నా ఆటలాగిపోయేవి. ఊహాలోకంలో నేను అమ్మఒడిలో నిద్దరోయినట్లు... అమ్మ లాలి పాడినట్లు...

అమ్మమ్మ దగ్గర అయిదు పైసలకోసం అరగంట ఏడ్చి, ఇచ్చిన తర్వాత వాటితో కొనుక్కున్న పసుపుపచ్చ బొంగులను చేతివేళ్ళకు తొడుక్కొని ఊరించుకుంటూ తినేది.. కమ్మనైన రుచి.. అమ్మ ప్రేమ కలిసిందా అన్నంతగా..



ఒక పెద్ద కర్ర పట్టుకొని చెట్టు చెట్టుకూ తిరిగి ఈతపళ్ళు రాలగొట్టి సంచిలో నింపుకొచ్చి జారుడు బండపై కూచొని తినేవాళ్ళం. ఆనాడు జరిగిన సంఘటన నన్నెంతగా కలవరపెట్టిందంటే మళ్ళీ జీవితంలో ఈతపళ్ళను చూస్తేనే భయమేసేంత.

ఈతపళ్ళు తెంపుతున్నప్పుడు ఓ పెద్ద ఈతముల్లు నా కాలికి గుచ్చుకుంది. విపరీతమైన రక్తం. చెప్పలేనంత బాధ. ఆ బాధతో 'అమ్మా!' అని అరిచాను.

నా పక్కవాడు 'నీకెక్కడి అమ్మరా.... అవసరమైతే అమ్మమ్మా అని అరువు'' అన్న మాటలు నా హృదయంలో ఈటెల్లాగా గుచ్చుకున్నాయి. ఈతముల్లు బాధకన్నా ఈ చిన్న గుండెలో కల్గిన నొప్పి అధికమై ... అనంతమై నన్నక్కడ వుండనివ్వలేదు. ఈతపళ్ళను వదిలి పరిగెత్తుకొచ్చాను.

ఓరోజు అమ్మమ్మ నడిగాను... అమ్మా నాన్న లెక్కడుంటారని. పైన వుంటారంటూ ఆకాశం వైపు చూపింది. ఆనాటి నుండి ప్రతీరాత్రి ఆరుబయట పడుకొని ఆకాశంలోని చుక్కల్లో వెతికేవాణ్ణి. అమ్మా నాన్నలు కనిపిస్తారేమోనని... అయినా ఆ ఆకాశం కూడా నాపై పగబట్టిందేమో... వాళ్ళను తనలో దాచుకుంది.

నా పదిహేనో ఏట అమ్మమ్మ కూడా వెళ్ళిపోయింది. నన్ను 'నిజంగా' అనాధను చేస్తూ.

అయినప్పటికీ... రామయ్య సార్ ప్రోత్సాహం నన్ను చదువుకునేలా పురికొల్పింది. అదే ఇప్పుడు నన్నీ దేశంలో ఫోర్‌మెన్‌గా నిలబెట్టింది.

గతం నుండి బలవంతంగా వర్తమానంలోకి నెట్టివేయబడ్డాను, రాజేశం నా భుజాలనూపుతూ పిలవగానే. ఉదయం ఆరు గంటలు. ఆరోజు సెలవే అయినా తమకేదో పనుందని నిశ్చయించారు రాజేశం అండ్ పార్టీ.

నేను స్నానం చేసి బయటకు వెళ్ళి తెచ్చిన కోడి మాంసాన్ని ఓ గిన్నెలో నానబెట్టాను అది చికెన్‌గా మారడానికి.

రాత్రి మందు ప్రభావమేమో... ఇంకా లేవలేదు నా రూంమేట్స్ ఫిలిప్స్, సులేమాన్. ఫిలిప్స్‌దేమో కేరళ, సులేమాన్ పాకిస్తాన్ నుంచి వచ్చాడు.

అన్నం తిని బస్సులో బయలుదేరాను... 'దేరా' మార్కెట్‌కి, మన వాళ్ళెవరైనా కలుస్తారేమోనన్న ఆశతో. మనసులో ఏదో వెలితి, హృదయపు డిక్షనరీలో 'తన' అనే పదంకోసం వెతుకుతున్న తాపత్రయం.

మార్కెట్లో కొంతమంది ఫ్రెండ్స్‌తో కలిసి టీ తాగాను... నా పురిటిగడ్డ మట్టివాసన నాస్వాదిస్తూ.

'అబ్రా' దాటి బార్‌దుబాయ్ వెళ్ళి అంజయ్యను కలుద్దామని బోటెక్కాను. 'అబ్రా' అంటే దేరా, బార్‌దుబాయ్‌ల మధ్య కృత్రిమంగా తయారుచేసిన... సముద్రంలో లింకున్న పెద్దకాలువ.

అంజయ్య లేడని తెలిసింది... ఆ కాంప్లెక్స్‌లోని మిగతా వాళ్ళ ద్వారా. అల్‌కోస్ లేబర్ క్యాంప్ నుండి ఎవరో ఫ్రెండ్స్ వస్తే అంబాసిడర్ హోటల్‌కు తీసుకెళ్ళాడట. నిస్సత్తువ, నిరుత్సాహం ఆవహించింది.

అట్నుంచటే... కరామాలో ఫ్యామిలీతో వుంటున్న విజయ్ ఫ్లాట్‌కి చేరాను. మేన్‌గేట్ వద్ద గార్డు అడిగాడు 'వేన్' అని, ఎక్కడికన్నట్లుగా. విజయ్‌కోసమని చెప్పాను. అతడు అలైన్, బ్రహ్మ్మాదాల మీదుగా మస్కట్ వెళ్ళాడట మరో ఫ్రెండ్ వద్దకు... వీకెండ్ సెలబ్రేట్ చేసుకోవడానికి.

నెక్స్ట్ వీక్ నా టికెట్ ఓ.కె. అయింది ఇండియా వెళ్ళేందుకు. అందుకే వీళ్ళను కలుద్దామనొస్తే.. బ్యాడ్‌లక్. ఎవరూ కలవలేదు. అయినా... మొబైల్‌లో ఇన్ఫర్మేషన్ ఇచ్చి వెనుదిరిగాను.

* * *

రూంకి చేరుకునే సరికి దుబాయ్ సూర్యుడు పశ్చిమ ఎడారి ఇసుకలోకి వెళ్ళి దాక్కోవడానికి తెగ ప్రయత్నిస్తున్నాడు.

సులేమాన్‌కి హై టెంపరేచర్... ఫిలిప్స్ తడిగుడ్డతో అతని శరీరమంతా తుడుస్తున్నాడు. ఆ జ్వరంలో... సులేమాన్ కలవరిస్తున్నాడు.... 'సలీమా'... 'సలీమా'... 'సలీమా'.. ఈ సలీమా ఎవరని ఆలోచించాను.... అతని భార్యా? కాదు... కాదు.. నాకు తెలుసు అతని భార్య పేరు 'జుబేదా' అని. మరి... ఈ సలీమా ఎవరు? ఇంకాస్త లోతుగా ఆలోచించాను, అప్పుడు నా మస్తిష్కంలో తట్టింది... అది అతని గారాల కూతురు పేరని.

వెంటనే 'రోలా'కి టాక్సీ మాట్లాడాను. అక్కడ మన ఆంధ్రా డాక్టర్ జ్యోతి క్లినిక్ వుంది. కన్సల్టేషన్, బ్లడ్ టెస్ట్, మందులూ.. మొత్తం నూటా నలభై దర్హమ్స్ ఖర్చుతో రూంకి చేరాము.

అతని ఆరోగ్య పరిస్థితి కొంత రికవర్ అయింది.

* * *

నేను ఇండియా వెళ్తున్నానని తెలిసి చాలా మంది తనవాళ్ళకు పార్శిళ్ళు, ఉత్తరాలు ఇచ్చి వెళ్తున్నారు. అందరి ముఖాల్లో సుస్పష్టమైన భావన. వాళ్ళంతా తమ వాళ్ళను చూడడానికి, పలకరించడానికి తనలో పరకాయ ప్రవేశం చేస్తున్న ఫీలింగ్. హృదయపు కవాటాలు తెరుచుకొని పరుచుకున్న జ్ఞాపకాల సడిలో ఎద సొద పెడుతూంటే... కళ్ళు వర్షాకాలపు వాగులోని చెలిమలై... ఉబికి వస్తున్న నీటితో వాళ్ళంతా నన్ను తడుపుతున్నారు. నా కళ్ళలో తమ రూపాల్ని ప్రతిష్టిస్తున్నారు.

మా పక్కూరి రాజేశం కూడా ఓ పార్శిల్‌తో వచ్చాడు. భార్యా పిల్లలకు దూరమై అతనేం కోల్పోతున్నాడో... సవివరంగా రాసివుందా అన్నంత దీనంగా వుందతని ముఖం.

''అన్నా! కండ్లు మూసినా, తెర్సినా నా పిల్లల మొకాలే కన్పిస్తున్నై. దయుంచి మా యింటికొయి మా అయ్యవ్వల్ను గొంత సముదాయించు. నా పెండ్లామును బెంగటిలకుమని సెప్పు... ఆస్టల్లకొయిగా పిల్లగాండ్లను సూడు.. గాల్లకు బుద్ధి మాటలు జెప్పు'' కవర్లోని డ్రెస్సులూ, చాక్లెట్లూ,



బొమ్మలూ... చూపిస్తూ చెప్పాడు. ''అన్నా! గివ్వి ఆస్టల్లకోయినపుడు మా పిల్లగాండ్లకు మీ నాన వంపిచ్చిండని సెప్పి ఇయ్యి''.

ఇంకో కవర్లోని చీరను తీసి ''గీ సీర.. ఎట్లుందే... మంచిగుందా... గిది మా యింటి దాన్కి'' అంటూ పరవశించాడు. ఆ చీరను చేతుల్లోకి తీసుకున్నప్పుడు చూశాను.. అతని కళ్ళలోని వెలుగు ముఖమంతా వ్యాపించింది. ఆమెపై నింపుకున్న ప్రేమ అతని ముఖం లో వొలికినట్లు...

* * *

అందరి ళ్ళలో వాళ్ళు పంపిన వస్తువులను అందజేసి, చివరగా రాజేశం తల్లిదండ్రుల వద్దకు వెళ్ళాను.

వాకిట్లో కూచుని చేపల వలను అల్లుతున్న పనిని ఆపి పలకరించాడు రాజేశం తండ్రి.

''అంత మంచిదేనా కొడుకా... మా రాజేశడు ఎట్లున్నడు''

''మంచిగనే ఉన్నడు''

నా మాట పూర్తయ్యేలోపే కొట్టంలో చేస్తున్న పనిని ఆపి వచ్చింది రాజేశం వాళ్ళ అమ్మ.

రాగానే కాళ్ళకు నీళ్ళిచ్చి నులకమంచం వేసి, కళ్ళనిండా నీళ్ళు నింపుకుంది.

చాలాసేపు వాళ్ళడిగిన ప్రశ్నలకు సమాధానాలిచ్చాను. పార్శిల్స్ వాళ్ళ చేతిలో పెట్టాను.

''కోడలు వాళ్ళ తల్లిగారింట్లోనే వుందా?'' అడిగాను.

''అవునుగానీ... నిన్ననే అచ్చింది. మా మర్ది బిడ్డ లగ్గం కోసమని'' అంది తల్లి.

తలుపు చాటున నిలబడి వున్న రాజేశం భార్య కనిపించింది.

''పిల్లలు ఎక్కడ?''


''కోరుట్ల ఆస్టల్ల వున్నరు'' చెప్పాడు తండ్రి.

హాస్టల్ అడ్రస్ తీసుకుని బయటికొచ్చాను. బైక్ స్టార్ట్ చేయబోయే సమయానికి ... ఏదో మరచిపోయాను...

ఆ .. గుర్తొచ్చింది. రాజేశంకు అతని భార్య ఏమైనా చెప్పాలనుకుందో అడుగుదాని వెనుదిరిగాను. ఇంట్లోకి వెళ్దామనుకునే సరికి రాజేశం భార్య అటువైపు తిరిగి, తన చీరకొంగుతో కండ్లను తుడుచుకుంటున్న దృశ్యం కనిపించింది. నా మనస్సు తెరపై ఏవేవో పిచ్చి గీతలు. ఇక ఆమెను అడగవలసిందేమీ లేదని అర్థం చేసుకుని బయటకు నడిచాను.

కోరుట్లకు వెళ్తున్న దారి పొడుగునా ఆలోచనలు....

వెళ్ళింది బ్రతుకుతెరువు కోసమే అయినా



సుదూర తీరాల్లోకి వెళ్ళి పొందుతున్న దానికన్నా ఇక్కడ కోల్పోతున్నది ఎంత విలువైందో తెలిసొచ్చిందా క్షణాన. అనుబంధాన్ని, అనుభూతుల్ని అన్నింటినీ అనివార్యంగా డామినేట్ చేస్తున్న డబ్బు విశ్వరూపమూ తెలిసొచ్చింది.

* * *

హైటెక్ హంగులతో వుందా హాస్టల్ ఆఫీస్ రూం. ఖరీదైన రివాల్వింగ్ చేర్‌లో కూచుని వున్నాడు హాస్టల్ కేర్‌టేకర్.

నన్ను పరిచయం చేసుకుని పిల్లల పేర్లు చెప్పగానే ఆఫీస్ రూంకే వాళ్ళని పిలుచుకొచ్చాడు అటెండర్. వసంత ఋతువులో వేపచెట్టు రెమ్మల చివర్ల వేసే లేలేత చివుళ్ళు గుర్తొచ్చాయి వాళ్ళను చూడగానే.

''స్టాండ్ ప్రాపర్లీ'' గద్దించాడు ఉరిమే కళ్ళతో కుర్చీలోని వ్యక్తి. వాళ్ళు నిలబడ్డ చోట భూకంపం వచ్చిందా అన్నంతగా వణికిపోయారా పసివాళ్ళు.

''సే యువర్ నేమ్స్'' మరొక్కసారి ఉరిమాడు.

'రజని'... 'రాకేష్' చెప్పారు వాళ్ళు. తనకు తాను ఏ పనీ చేసుకోలేని, ఏ మాటనీ సరిగా ఉచ్చరించలేని వయస్సు రజనీది. రెక్కలు తొడగని చిన్నారి రామచిలుకల్ని పంజరంలో బంధించిన భావన.

రాకేష్ ఫస్టు క్లాసు... అంటే రాకేష్‌ది మా



అమ్మా నాన్నలు పోయినపుడు నావయసంత.

వాళ్ళని ఓసారి పిలిచి దగ్గరకు తీసుకొని హత్తుకున్నాను. నా హృదయమంతా కరిగి నీరుగా మారి కళ్ళలో చేరిందేమో... ఎంత ఆపుకున్నా కొన్ని చుక్కల రూపంలో బయటకొచ్చింది.

అమ్మ ప్రేమ, నాన్న ఆప్యాయతలకు దూరంగా వుండి ఆ 'బాల్యం' సాధించేదేమైనా వుంటుందా..?

వాళ్ళ నాన్న పంపిన బొమ్మలు, చాక్లెట్లూ, డ్రెస్సులూ ఇచ్చి, వాటిని ట్రంకు పెట్టెలో సర్దడానికి పిల్లల రూంకెళ్ళాను. వెంట ఆయా వచ్చింది.

రాకేష్ నడిగాను... 'మీ నాన్న ఎక్కడో తెలుసా?'

''ఓ ... తెలుసూ.. దుబాయ్'' చెప్పాడు వాడు.

రజని ముఖంలోకి చూస్తూ ''ఏమ్మా! మీ అమ్మ ఇక్కడికి అప్పుడప్పుడు వస్తుందా?'' ప్రశ్నించాను.

''మా అమ్మ ఇక్కలే వుంతుందిగా'' వచ్చీరాని మాటలతో ఆ పాప చెప్పిన సమాధానం నన్నాశ్చర్య పరిచింది.

''ఇక్కడ వుండడమేమిటి ... ఏదీ చూపించు'' అన్నాను క్లారిఫై చేసుకుందామని.

''ఇదిగో... మా అమ్మ'' అంటూ ఆ అమ్మాయి చూపుడు వేలుతో చూపిన దిక్కు చూడగానే నా గుండె కొట్టుకోవడం ఆగిందా క్షణం.

ఆమె చూపింది ఆయాని. ఆ పిల్లలకు స్నానం చేయించడం, అన్నం తినిపించడం లాంటి పనులన్నీ చేసేది ఆయానే. హాస్టల్‌లోని పిల్లలంతా ఆమెని పిలిచేది కూడా 'అమ్మా!' అనే.

అందుకేనేమో ఆ ఆయానే వాళ్ళమ్మ అనుకుంటున్నారు. నాలో చిత్రమైన ఆలోచన... మా అమ్మ బతికుంటే ఈ ఆయాలాగే వుండేదేమో. ఎంత మనసులో ఆపుకుందామన్నా ... బయటికే అనేశాను ''అమ్మా' అని.

బాల్యంలో నేను తల్లిదండ్రులు లేక కోల్పోయిన ప్రేమలు, ఈ పిల్లలు అమ్మా నాన్నలున్నా వాటికి దూరమౌతున్న తీరు నన్నెంతగానో కలచివేసింది.

కూర్చున్నచోటే తలవంచి, అరచేతుల్లో ముఖాన్ని దాచుకొని కళ్ళు మూసుకున్నాను. అవి వర్షిస్తూ... నే వున్నాయి.

రాజేశం ఆత్మ నాలో ప్రవేశించిందా అన్నంతగా.

యాదృచ్ఛికంగా పర్స్ తీశాను. ఓ అయిదు వందల రూపాయల నోటు ఆయాకిచ్చి చెప్పాను. ''రాజేశం నీకివ్వమని చెప్పాడు. పిల్లల్ని కంటికి రెప్పలా కాపాడుమని వేడుకొన్నాడు''.

రాజేశం లాంటి వారు మర్చిపోకూడని వ్యక్తులలో ఈ ఆయా లాంటి వారింకెందరో...?!

* * *

ఇంటికి వచ్చానన్న మాటేగానీ ఏదో వెలితి... తెలియని అనిశ్చితి. ఇంతకుముందు ఎప్పుడొచ్చినా ఇలా ఫీలవలేదు. కానీ ఈసారి... ఈసారి.... సజ్జపైన నే తెచ్చిన సూట్‌కేస్‌లోంచి పాము బుస వినిపిస్తున్నట్టుగా అనిపించింది.

నా వీసా, పాస్‌పోర్ట్, రిటర్న్ ఫ్లైట్ టికెట్... అన్నీ అందులోనే వున్నాయి. భయంతో ఒళ్ళంతా చెమట పట్టింది. ★

## ఇప్పుడిక ఇంగ్లిష్ రాణి



వైవిధ్యానికి ఇప్పుడు అందరూ చెప్పుకుంటున్న పేరు రాణి ముఖర్జీ. హమ్‌తుమ్, యువ సినిమాల్లో ఎంతమాత్రం పొంతనలేని పాత్రలు చేసి అందరిచేత భేష్ అనిపించుకుంది తను. రాణి అభిమానులకు ఓ శుభవార్త. హాలీవుడ్ కొత్త తరం నటుడు ఎతాన్ హాకేతో తను ఓ సినిమాలో నటించబోతోంది. ఇంగ్లిష్ ఆగస్ట్ డైరెక్టర్ దేవ్ బెనెగల్ తీస్తున్న కొత్త సినిమా ఇది. టేకింగ్ లైవ్స్ సినిమాలో ఏంజెలీనా జోలీతో నటించిన హాకే ఇప్పుడు కొత్తతరం హాట్ ఫేవరైట్. ఓ ఇంగ్లీషు పిల్లాడు భారతీయ యువతితో ప్రేమలో పడటం ఇందులో కథాంశం. ఖండాలా పిల్ల ఖ్యాతి మెల్లిగా ఖండాంతరాలకు పాకుతోంది.